క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఏలూరు డీఎస్పీ



డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు నూతన డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఎం.దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

గంగానమ్మకు సారె సమర్పణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కొత్తపేటలో వేంచేసియున్న గౌరీ పరమేశ్వర ఆలయంలోని శ్రీ గంగానమ్మ అమ్మవారి ఉపాలయంలో అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా అధ్యక్షులు బుగ్గ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. 250 మంది మహిళలు 108 రకాల స్వీట్స్, ఫ్రూట్స్, పిండి వంటలు, చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమలతో మంగళ వాయిద్యాలతో నగర వీధులలో అమ్మవారి నామస్మరణతో ఆలయానికి ఊరేగింపుగా విచ్చేసి పుట్టినింటి నుంచి తెచ్చిన సారెను అమ్మవారికి సమర్పించారు. ప్రధాన అర్చకులు సదాశివశర్మ, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు మల్లిమొగ్గల సుధాకర్, తాబేలు కుమార్, దేవతోటి ప్రసాద్, సేనాపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ

ఏలూరు (టూటౌన్): కేరళలో వరద బాధితులకు సహాయంగా ఐద్వా ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో సోమవారం రూ.3వేలు విరాళాలు సేకరించినట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేరళలో కొండ చరియలు విరిగిపడి 400 మందికి పైగా ప్రజానీకం చనిపోయారని అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి విరాళాలు సేకరించామని, ఈ మొత్తాన్ని ఐద్వా కమిటీ ద్వారా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తామన్నారు. విరాళాల సేకరణలో మువ్వాడ లక్ష్మి, వై.విజయ, బి.రామకృష్ణ,టి.శ్రీలక్ష్మి పాల్గొన్నట్లు తెలిపారు.

ఈ రోడ్డులో రాలేం.. పోలేం

- వెంకట్రామా ప్రెస్ రోడ్డులో ఇష్టానుసారంగా పార్కింగ్
- గంటల తరబడి నిలిచిపోతున్న ట్రాఫిక్‌తో అవస్థలు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న నగర ప్రజలు



పవరుపేట వెంకట్రామ ప్రెస్ రహదారిలో రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహనాలు



రోడ్డు మధ్యలో నిలిపిన ఓ ఆటో

ఏలూరు (టూటౌన్): అసలే ఇరుకు రోడ్డు.. దీనికి తోడు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు వాహనాలను రోడ్డుపై ఇష్టానుసారంగా నిలిపివేస్తుండటంతో కనీసం నడిచి వెళ్ళేవారికి కూడా దారి ఉండదు. ఇదీ పవరుపేటలోని వెంకట్రామ ప్రెస్ రహదారి దుస్థితి. ఇక్కడ ఉన్న దుకాణదారులు, కార్యాలయాలు, వీటి కోసం వచ్చేవారి తీరుతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వందలాది మంది నానా అవస్థలు పడుతున్నారు. సాధారణంగా నగరంలోని పవరుపేట, రామచంద్రరావుపేట, వన్‌టౌన్ వంటి ప్రాంతాలు వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాలలో నిత్యం వేలాది మంది ప్రజలు తమ అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు వంటి వాటికి సరైన పార్కింగ్ సౌకర్యం లేక రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపివేస్తుండటంతో ఆ మార్గంలో వెళ్ళే పాదచారులు, ద్విచక్రవాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నారు. వీరి తీరు కారణంగా ఇతర దుకాణాలకు వచ్చేవారు సైతం వాహనాలు నిలుపుకునే జాగా లేక ఆగకుండానే వెళ్లిపోతున్నారని, దీనివల్ల తాము నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయంటూ ఈ ప్రాంతంలోని వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. పవరుపేటలోని వెంకట్రామ ప్రెస్ రోడ్డులో ప్రైవేటు బ్యాంకులు, మోటార్ సైకిల్ ఫైనాన్స్ సంస్థలు వంటివి ఉన్నాయి. వీటి వద్దకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చి వెళ్ళే వారు ప్రతి రోజు పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. వీరందరూ తమ వాహనాలు నిలుపుకునేందుకు సరైన చోటు లేకపోవడంతో ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడే తమ వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో వెళ్ళే సాధారణ పౌరులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఈ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయకుండా నియంత్రించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

రోడ్డుపైనే పార్కింగ్‌తో ఇబ్బందులు



వెంకట్రామా ప్రెస్ రోడ్డులో ప్రతి రోజు రోడ్డుపైన, రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నాం. ఒక్కో సమయంలో అడ్డుగా ఉన్న వాహనాలను మేమే పక్కకు పెట్టి వెళుతున్నాం. ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పి.ఈశ్వర్, స్థానికుడు, పవరుపేట, ఏలూరు

సమస్య పరిష్కరించాలి



పవరుపేటలోని వెంకట్రామ ప్రెస్‌రోడ్డులో ప్రతి రోజు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నగరపాలక సంస్థ సిబ్బంది, పోలీసు అధికారులు ప్రతిరోజు ఈ రహదారిలో సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి. ఒకరోజు అయితే పర్వాలేదు కానీ, రోజూ ఇక్కడ ఇదే సమస్యతతో ఇబ్బందులు పడుతున్నాం.

– ఎస్.గోపీకృష్ణ, స్థానికుడు, పవరుపేట, ఏలూరు

తాడిపూడి కాలువ పనులు పూర్తి చేయాలని వినతి

ఏలూరు (టూటౌన్): తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తాడిపూడి ఎత్తిపోతల పథకం ఉందని, పథకానికి శివారు ఆయకట్టుగా ఉన్న ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లో కాలువ పనులు పూర్తి చేయకపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. కాలువల నిర్మాణానికి రైతుల నుంచి భూసేకరణ చేసి అసంపూర్తిగా కాలువలు తవ్వి వదిలివేశారన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, రైతులు ఈడే మురళీకృష్ణ, గోవాడ గోపాలం, వీరవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫాదర్ ఇన్నయ్య మృతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు పీఠం సీనియర్ గురువు ఫాదర్ చింతగుంట ఇన్నయ్య (77) వయోభారంతో స్థానిక ఫాదర్ పాజ్జోలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు బిషప్ హౌస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏలూరు పీఠం పరిధిలో 49 ఏళ్ల పాటు ఇన్నయ్య గురుత్వ సేవలు, పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొంది. ఇన్నయ్య మృతికి ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరాజు పొలిమేర, అమలోద్భవి కథీడ్రల్ గురువు ఫాదర్ మైఖేల్ ఇంజమాల, ఫాదర్ జీ.మోజెస్, ఫాదర్ బాల, ఫాదర్ తోట అంథోని తదితరులు ఇన్నయ్య భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- ఏలూరు మండల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ప్రారంభం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు రూరల్: గ్రామ పంచాయతీలు ఆర్థిక స్వాలంబన దిశగా పయనించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. సోమవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు రూరల్ మండల సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ తరగతులు ప్రారంభయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ జాతిపిత మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్రంగా పనిచేయాలని సూచించారు. గాంధీజీ స్ఫూర్తితో గ్రామాభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. పాలనలో సమర్థత నిరూపించుకుని స్థానిక సంస్థలను బలోపేతం చేయాలన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రాజీనామా చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ప్రజలతో నేరుగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లు ప్రజలకే జవాబుదారులని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారినప్పటికీ స్థానిక సంస్థలు కాలపరిమితి ఉన్నంత వరకూ పనిచేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. దీన్ని గుర్తించి పంచాయతీల్లో ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడంలో స్థానిక సంస్థల సభ్యులే ముందు వరుసలో ఉండాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, పారిశుధ్యం మెరుగుదల, వీధి దీపాలు నిర్వహణ తదితర అంశాలపై సర్పంచ్, కార్యదర్శులు కలిసి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ బి.ప్రణవి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో పంచాయతీ పాలన, అభివృద్ధిపై వివరించడంతో పాటు మంగళవారం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సర్పంచ్‌లకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి పాల్గొన్నారు. అనంతరం గుడిపూడి రఘు, వర్రీ లక్ష్మీదుర్గ, కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్ తదితర సర్పంచ్‌లు, కార్యదర్శులకు రీసోర్స్ పర్సన్స్ ధర్మగోవింద్, సుమలత శిక్షణ అందించారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి



జీవ వైవిధ్యంపై చర్చా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు జీవ వైవిధ్యంపై అవగాహన కలిగి ఉండడమే కాక, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని సమగ్రశిక్ష ఏఎంఓ రెడ్డి రామారావు సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ‘జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో యువత పాత్ర’ అనే అంశంపై వక్తృత్వం, చర్చా, లఘు చిత్ర ప్రదర్శనల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. సోమవారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 79 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.సోమయాజులు ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. న్యాయ నిర్ణయాలుగా హెచ్‌ఎంలు ఎం.శ్రీనివాస్, జి.రమాదేవి, సైన్సు ఉపాధ్యాయులు జి.గంగాధర్, ఆర్‌వీ మల్లికార్జున్, ఐఎస్‌ఎల్ రామలక్ష్మి వ్యవహరించారు. డీవైఈఓ కె.రవిప్రకాష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోటీల్లో విజేతల వివరాలను డీఈఓ ఎస్.అబ్రహం సోమవారం సాయంత్రం ప్రకటించారు. వక్తృత్వ పోటీల్లో వై.దివ్యశ్రీ, టి.హాస్యసుమ, పి.జెస్సికా, జీవ వైవిధ్యంపై చర్చా పోటీల్లో పి.ఎల్సీ కేజియా, బి.శ్వేత, పి.నీరజలక్ష్మీ దయాళ్, షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో పి.మౌనిక, డి.కుసుమ, ప్రసన్న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయాలని పలువురు వక్తలు సూచించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, భారత్ బచావో బహుజన్ ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ తదితర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 78వ స్వాతంత్య్ర దినోత్సవం, భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం, స్వాతంత్య్ర యోధుల వేషధారణ పోటీలు నిర్వహించారు. 100 స్కూళ్లు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం రామకోటి కళావేదికపై జరిగిన సభకు నిర్వాహక కమిటీ సమన్వయకర్త గుబ్బల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ ప్రజలను ఐక్యంగా ఉంచడంలో భారత రాజ్యాంగం ఎంతగానో తోడ్పతుందన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డి.కిషోర్ మాట్లాడుతూ యువజన సంఘాలు ఏర్పాటు చేసుకుంటే తమ శాఖ ద్వారా క్రీడలలో ప్రోత్సహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం కలిపి వినూత్న కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. రాజ్యాంగ పీఠికను దేవరకొండ వెంకటేశ్వర్లు చదివి సభలోనివారితో ప్రమాణం చేయించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు సీహెచ్ జగదీష్, టీ.తులసి, కే. శ్రీనివాసరావు బృందం సర్టిఫికెట్లు అందజేశారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం



కొమడవోలులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంహెచ్‌ఓ మాలతి

ఏలూరు (టూటౌన్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఒకటో డివిజన్ పరిధిలోని కొమడవోలు, కోడేలు మెయిన్ రోడ్డు, హమాలీ కాలనీ ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నగరపాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలతి మాట్లాడుతూ దోమల లార్వా నిర్మూలనకై స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. నాయకులు గరికపూడి చంటిబాబు, మురాల దుర్గారావు, మేతర అశోక్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్‌స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బౌస్‌రాజు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యువత సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకుని నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సెట్‌వెల్ సీఈఓ సీ మధుభూషణరావు అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ, జిల్లా యువజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు నేటి డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చదువులలో ముందంజలో ఉండాలన్నారు. కొత్త వృత్తి నైపుణ్య కోర్సులను నేర్చుకుని జీవితంలో బాగా స్థిరపడాలని ఆకాంక్షించారు. స్ఫూర్తి సంస్థ కార్యదర్శి షేక్ మొహిద్దిన్ బాషా మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే ఉన్నత స్థానానికి చేరవచ్చన్నారు. మానవతా సంస్థ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి విలువలు కలిగి ఉంటేనే మంచి స్థాయికి చేరవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కర్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ వీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, డిబేట్, క్విజ్ పోటీలలో విజేతలకు స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ద్వారా జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

కల్లం నుంచే ధాన్యం కొనాలి

మంత్రి నాదెండ్లకు రైతు సంఘం వినతి

ఏలూరు (టూటౌన్): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విధానాన్ని రూపొందించాలని, కల్లాలు నుంచే ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. నగరంలోని సీఆర్ఆర్ కాలేజ్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ధాన్యం బకాయి చెక్కులు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రైతు సంఘం జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలు సమస్యలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పంట పండించడానికి కంటే పంట అమ్ముకోవటానికే రైతు ఎక్కువ కష్టపడాల్సి వస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంటలను రక్షించుకునేందుకు ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేక అన్నదాత నష్టపోతున్నాడన్నారు. సామూహిక కల్లాలు, గ్రామీణ ప్రాంతాలలో పంట నిల్వ చేసుకునే షెడ్లు నిర్మాణం చేయాలని, టార్పాలిన్లు సబ్సిడీపై అందించాలని కోరారు. పంట సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లతోనే ధాన్యం కొనుగోలు చేయాలని, ఈ–క్రాప్‌లో పేర్లను నమోదు చేయాలన్నారు. తేమ శాతం వంటి నిబంధనలను సడలించాలని కోరారు. రైతుకు ధాన్యం సొమ్ము 48 గంటల్లో చెల్లించేలా ముందుగా తగు నిధులు కేటాయింపు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కారానికి అన్ని చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన రబీ ధాన్యం బకాయిలు పూర్తిగా రైతులకు చెల్లించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కలెక్టర్‌తో చర్చించిన ఎంపీ

ఏలూరు (మెట్రో): పలు ప్రజా సమస్యలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి చర్చించారు. సోమవారం స్థానిక కలక్టరేట్‌లో ఎంపీ మహేష్‌కుమార్ కలెక్టర్‌ను కలిసి తాగునీటి సమస్య, అభివృద్ధి పనులు, దీర్ఘకాలిక ప్రాజెక్టులు తదితర అంశాలను చర్చించారు.

ఈ-క్రాప్ నమోదుతోనే పంటల బీమా

దెందులూరు: ఈ–క్రాప్ నమోదుతోనే పంటలకు ప్రభుత్వ బీమా అమలు చేస్తారని తహసీల్దార్ బి.సుమతి చెప్పారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం శివారు ప్రాంతాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. పంటల వివరాలను నిబంధనల మేరకు ఈ–క్రాప్ విధానంలో నమోదు చేస్తామన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గణపవరం (భీమడోలు): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని భీమడోలు సీఐ బీబీ రవి కుమార్, భీమడోలు ఎక్సైజ్ సీఐ గిరిజ అన్నారు. సోమవారం నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమడోలులో గీతాంజలి జూనియర్ కాలేజి, మాధురీ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం, అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు మార్గం పట్టడానికి మాదక ద్రవ్యాల వినియోగమే కారణమన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతగా భావించాలని, ఎవరైనా మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని 14500 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి, గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	30-72
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	7,10
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	32-40	కీరా దోస	50
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	40	అల్లం	100-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-56	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	20-28	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

